

తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో పారిశుద్ధ్యం నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రం

# స్వచ్ఛాంధ్రోదయం!

9లో

- పరిశుభ్రత వైపు పల్లెసీమలు, పట్టణాలు
- నేటి నుంచి దేశమంతా స్వచ్ఛభారత్ ద్వితీయ వార్షికోత్సవాలు
- గాంధీ జయంతి వరకు వారంపాటు నిర్వహణ

# స్వచ్ఛాంధ్రోదయం!

**మరుగుదొడ్డి కట్టుకోవడానికి ముందుకు రాని ఇంటికి తెల్లవారు జామునే వెళ్లి ఇంటిముందు ధర్నా చేసిన సర్పంచి... చెత్తకుప్పలు తెచ్చి వేరు చేస్తున్న ప్రాంతంలో దుర్గంధాన్ని దూరం చేసి ఏకంగా అక్కడ సామూహిక విందుభోజనాలు చేసుకుంటున్న పల్లె సీమలు. వానపాము ఎరువులను ఆన్‌లైన్‌లో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న పల్లెటూరి మనుషులు.. ఇదంతా ఒకపక్క.**

**మేముసైతం అంటూ జాతిపిత జయంతి రోజున బహిరంగ మలమూత్ర విసర్జన రహితమైనవిగా ప్రకటించుకోవడానికి తహతహలాడుతున్న పట్టణాలు మరోపక్క**



తూర్పుగోదావరి జిల్లా ఉండూరులో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రం

ఇవేవో ఎక్కడో జరిగిన అద్భుతాలు కాదు... మన మధ్య జరుగుతున్న నేటి 'స్వచ్ఛభారత' ప్రగతి కాంతులు. ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ స్ఫూర్తికి ఇవి తార్కాణాలు. వివిధ స్థాయుల్లో పడుతున్న ఆచరణాత్మకమైన అడుగులకు నిలువుటద్దాలు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దోమలపై దండయాత్ర, పరిసరాల పరిశుభ్రత లాంటివి ఈ మహత్కార్యానికి వెన్నుదన్ను. ఈ దిశగా ప్రజల ఆలోచనల్లో ప్రారంభమైన సానుకూలత వయోభేదాలకు అతీతమై విస్తృతమైతే భారత్ విశ్వవిఖ్యాతమవుతుంది. ఆరోగ్య భారత్‌కు ఇది ఆధారమవుతుంది. ఆదివారం నుంచి స్వచ్ఛ భారత్ ద్వితీయ వార్షికోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛభారత్ వారంగా పాటిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది.

ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో 'స్వచ్ఛ' వికాసాన్ని స్థూలంగా పరిశీలిస్తే పరిశుభ్రత కోసం చాలా పల్లెసీమలు దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నాయి. రెండున్నరేళ్లలో రాష్ట్రంలోని మొత్తం 1,290 పంచాయతీలను పరిశుభ్ర పంచాయతీలుగా ప్రకటించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఈ దిశగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కొన్ని పల్లెల్లో సాధిస్తున్న విజయాల స్ఫూర్తిని మిగిలిన పల్లెలకు తీసుకెళ్లి పల్లె సీమలను స్వచ్ఛ సీమలుగా మార్చాలని యంత్రాంగం కంకణబద్ధమైంది.



**తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండలం జి.మేడపాడులో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు**

**ఆదాయం:** స్వచ్ఛత పరిశుభ్ర అంశంగానే కాకుండా ఆదాయ మార్గంగా కొన్ని పల్లెలు చూస్తున్నాయి. 659 పంచాయతీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. దాన్ని 13 రకాలుగా వేరు చేసి విక్రయించి పంచాయతీలకు ఆదాయం సాధిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలం జి.మేడపాడు, ఉండూరు పంచాయతీల్లో ఇలా సేకరించిన వ్యర్థాలను విక్రయించి ఆదాయం గడిస్తున్నారు. చెత్తలో వచ్చిన పాత చెప్పులను కూడా జత రూ.3లకు విక్రయిస్తున్నారు. చెత్తను కుళ్లబెట్టి, వర్మీ కంపోస్ట్ తయారు చేసి ఎరువులుగా అమ్ముతున్నారు. ఈ మొత్తం పనులన్నీ ఒకే చోట చేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని ఎంత శుభ్రంగా ఉంచుతున్నారంటే చివరకు అక్కడ విందు కార్యక్రమాలు నిర్వహించుకునేంత పరిశుభ్రత పాటిస్తున్నారు.

**ఇళ్లల్లో సర్పంచి ధర్నా:** తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి పంచాయతీ సర్పంచి సూర్యచంద్ర గ్రామంలో వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా కృషి చేశారు. తెల్లవారుజామునే ఈ సర్పంచి కొంతమంది ఇళ్లకెళ్లి వారు మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి ముందుకొచ్చే వరకూ ఆ ఇళ్లముందు ధర్నాలు చేశారు.

### అమేజాన్‌లో 'సేంద్రీయ ఎరువుల అమ్మకం'

గ్రామాల్లో తయారు చేస్తున్న వర్మీ కంపోస్ట్‌కు డిమాండ్ ఉంది. ఇక్కడ తయారయ్యే ఈ ఎరువులో సేంద్రీయ కర్బన్లు 44 శాతం ఉండేలా చూస్తున్నారు. ఈ ఎరువులను ఆన్‌లైన్‌లో విక్రయించడానికి అమేజాన్ ఆసక్తి చూపుతూ ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. అదే జరిగితే కిలో వర్మీ కంపోస్ట్ ధర కనీసం రూ.40 నుంచి రూ.220 వరకూ విక్రయించుకునే వీలుంటుంది.

ఇలాంటి స్ఫూర్తిని మిగిలిన గ్రామాలకూ అధికారులు తీసుకెళ్లి సత్ఫలితాలు రాబట్టే ప్రయత్నాల్లో ఉన్నారు.

**పట్టణాల్లోనూ....:** గాంధీ జయంతి రోజున రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహితమైనవిగా ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఇప్పటికే 2,622 వార్డులను బహిరంగ విసర్జన రహితాలు ప్రకటించారు.

### చెత్త సమస్యను పరిష్కరిస్తాం

పట్టణ ప్రాంతాల్లో చెత్త సమస్యను సమర్థంగా ఎదుర్కొంటాం. వివిధ దేశాల్లో అవలంబిస్తున్న మంచి పద్ధతులను ఇక్కడ అమలు చేసి, చెత్తను విద్యుత్తుగా మార్చి పురపాలక సంఘాల ఆదాయ వనరుగా మారుస్తాం.

– పి.నారాయణ, పురపాలకశాఖమాత్యులు.

### ఆరునెలలకోసారి సమీక్ష

పురపాలక సంఘాలను బహిరంగ విసర్జన రహితాలుగా ప్రకటించేసి చేతులు దులిపేసుకోం. ఆరునెలలకోసారి పర్యవేక్షించి రాష్ట్రాన్ని అందరికీ ఆదర్శప్రాయం చేస్తాం.

–మురళీధర్‌రెడ్డి, ఎండీ,
స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్

ఈనాడు – అమరావతి